# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 13 మార్చి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కేసు.. ముగిసిన వాదనలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత వేటు వేయాలని, స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణను ముగించింది. ఈ విషయంలో స్పీకర్ నిర్ణయం తీసుకున్నందున ఇకపై ఈ వ్యవహారంలో తదుపరి విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే స్పీకర్ తీర్పు కాపీని శుక్రవారం ముగిసే లోపు అప్‌లోడ్ చేయాలని, నాలుగు రోజుల్లో ప్రతివాదులకు సంబంధిత పత్రాలు అందజేయాలని ఆదేశం చింది. ఈ వ్యవహారంలో గతంలో సీజేఐ ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ల కోర్టు ధిక్కరణ పిటిషన్లు వేయగా, ప్రభుత్వం మరింత సమయం కావాలని ఆశ్రయించింది. ఈ నాలుగు పిటిషన్లను గురువారం జసిస్ట్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్తీన్ జార్జ్ మాసిహ్ ల నేతత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తెలంగాణ స్పీకర్ కార్యాలయం, అసెంబ్లీ సెక్రెటరీ తరపున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, నిరంజన్ రెడ్డిలు, ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గిలు హాజరయ్యారు. తొలుత అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపిస్తూ... 10 ఎమ్మెల్యేలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టిన స్పీకర్ తాజాగా నిర్ణయం తీసుకున్నారని కోర్టుకు నివేదించారు. స్పీకర్ నిర్ణయం తీసుకున్న తరువాత విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని తెలిపారు. అయితే స్పీకర్ ఉత్తర్వు కాపీలను ఇంకా పిటిషనర్లకు అందలేదని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. స్పీకర్ కార్యాలయం ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేయాలని చూస్తోందని ఆరోపించారు. టైం బాండ్ తో తమకు స్పీకర్ తీర్పు కాపీలను అందజేసేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇరువైపు వాదనలను పరిగణలోకి తీసుకొన్న ధర్మాసనం... ఇకపై కేసును కొనసాగించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ విచారణను ముగించింది. అలాగే ఈరోజు లోపు అధికారిక సైట్ లో స్పీకర్ తీర్పును అప్ లోడ్ చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా చట్టానికి లోబడి పిటిషనర్లకు నాలుగు రోజుల్లో సంబంధింత పత్రాలు అందజేయాలని ఆదేశిస్తూ... ఐదు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

### 1.15 కోట్ల కుటుంబాలకు

# జీవిత బీమా, ఆరోగ్య భద్రత లక్ష్యం



- పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తే దాదాపు 90 శాతం సమస్యలు పరిష్కారమవుతాయి
- సీఎం రేవంత్ రెడ్డి
- కోకాపేటలో మెడికవర్ ఆసుపత్రి ప్రారంభించిన సీఎం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు జీవిత బీమా, ఆరోగ్య భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తే సమాజంలోని దాదాపు 90 శాతం సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. హైదరాబాద్ కోకాపేట ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కొత్తగా నిర్మించిన మెడికవర్ ఆసుపత్రిని ముఖ్యమంత్రి మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "మహిళలు అత్యధికంగా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నందున రాష్ట్రంలోని 65 లక్షల మంది స్వయం సహాయక మహిళా సంఘాలకు డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించాం.గడిచిన రెండేళ్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కింద 1800 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు పెట్టాం. ఉస్మానియా, వరంగల్ టిమ్స్, అల్వాల్ టిమ్స్, ఎల్బీనగర్ టిమ్స్, సనత్ నగర్ టిమ్స్, నిమ్స్.. ఆసుపత్రుల్లో దాదాపు 10 వేల కోట్లు ఖర్చు చేసి 10 వేల పడకల ఆసుపత్రులను నిర్మిస్తున్నాం. విద్య ఇప్పుడు మారుమూల ప్రాంతాలకు చేరినప్పటికీ నాణ్యమైన విద్య అందడం లేదు. యాంత్రికంగా సాగుతున్న విద్యా విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టాం. నైపుణ్యత మెరుగుపర్చుకోకుంటే, ప్రపంచంతో పోటీ పడలేం. అందుకే విద్యా విధానంలో సంస్కరణలు చేపట్టాం. ఒక పాలసీ తీసుకొచ్చాం. విద్యతో పాటు స్కిల్స్ అవసరం.నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు నాణ్యమైన విద్యను అందించాలని కొత్త కాన్సెప్ట్‌తో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ విధానం తీసుకొస్తున్నాం. ఇప్పటివరకు 10 వ తరగతి తర్వాత ఇంటర్ విధానం కొనసాగుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి 12 వ తరగతి పాఠశాల విద్య కింద తీసుకొస్తున్నాం.

విద్యార్థులకు పాఠశాలల్లో ఉదయం నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయించాం. కార్పొరేట్ స్కూల్స్ తరహాలోనే విద్యార్థులకు ఉచితంగా లేదా 50 శాతం ఖర్చుతో రవాణా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కోర్ అర్బన్ రీజియన్‌లో నూతన విధానం ప్రవేశపెట్టాలని భావిస్తున్నాం.ఏఐ రావడం వల్ల టెక్నాలజీ రంగంలో వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయంగా మారొచ్చునేమో, కానీ బ్లూ కాలర్ జాబ్స్‌ని ఏఐ రిప్లేస్ చేయలేదు. స్కిల్స్ లేని కారణంగా ప్రతి ఏటా రాష్ట్రం నుంచి 1.10 లక్షల ఇంజనీరింగ్ గ్యాడ్యుయేట్లు ప్రపంచంతో పోటీ పడలేని పరిస్థితి.అందుకే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రారంభించాం. టాటా కన్సల్టెన్సీ సహకారంతో పురాతన ఐటీఐలను ఏటీసీ సెంటర్లుగా మార్చాం. తర్వాత దశలో పాలిటెక్నిక్ కాలేజీలను కూడా ఈ విధానంలోకి తెస్తాం.కార్పొరేట్ ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యులు సామాజిక బాధ్యత కింద సంవత్సరంలో నెల రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు సేవలు అందించాలి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఒక వేదిక సృష్టించబోతోందని, విదేశాల్లో ఉన్న మన వైద్యులతో పాటు ఇక్కడ కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు కూడా ముందుకు రావాలి.

వైద్యం యాంత్రికంగా చేసే వృత్తి కాదు. పేదలకు, కష్టాల్లో ఉన్నవారికి మానవత్వంతో కూడిన వైద్య సహాయాన్ని అందించినప్పుడే రోగులకు వారి కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. ఆసుపత్రుల్లో వైద్యులు వ్యవహరించే తీరు, నిర్వహించే విధానమే రోగుల సగం సమస్యలను పరిష్కరిస్తుంది. దేశంలో 25వ మెడికవర్ ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషం. దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఈ హాస్పిటల్ మరింతగా రాణించాలి" అని ముఖ్యమంత్రి గారు అభిలషించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుందూరు జైయవీర్ రెడ్డి, నవీన్ యాదవ్, మెడికవర్ హాస్పిటల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కృష్ణ , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ శరత్ రెడ్డి గారు, డాక్టర్ హరికృష్ణ హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్‌తో పాటు పలువురు ప్రముఖులు వైద్యులు పాల్గొన్నారు.

# పాక్ ఆరోపణలు నిరాధారం

**భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్**



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ఘర్షణల వెనుక భారత్ ఉందన్న పాకిస్థాన్ ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ స్పష్టం చేశారు. తన తప్పులను దాచుకునేందుకు ఇతర దేశాలపై నిందలు వేయడం పాకిస్థాన్‌కు అలవాటైందని ఆయన విమర్శించారు. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ మాటలకు విశ్వసనీయత లేదన్నారు. పాక్ ఎన్ని కథలు సృష్టించినా వాస్తవాలను మార్చలేదని తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

అఫ్గాన్ భూభాగంపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండిం చింది. ఈ దాడుల్లో మహిళలు, పిల్లలు మరణించడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేసింది. పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడులు జరగడం విచారకరమని పేర్కొంది. అఫ్గానిస్థాన్ సార్వభౌమత్వం, సమగ్రత, స్వాతంత్ర్యానికి భారత్ పూర్తి మద్దతు ఉంటుందని విదేశాంగ శాఖ తెలిపింది.

ఇటీవల పాకిస్థాన్--అఫ్గానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. ఫిబ్రవరి 27న అఫ్గాన్ రాజధాని కాబూల్ సహా పలు ప్రాంతాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు జరిపినట్లు సమాచారం. ఈ ఘటనపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్పందిస్తూ తమ సహనానికి హద్దులు దాటిపోయాయని పేర్కొన్నారు. అఫ్గానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వం అంతర్జాతీయ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తోందని ఆరోపించారు. అదే సమయంలో డ్యూరాండ్ రేఖ వెంబడి జరిగిన ప్రతీకార చర్యల్లో 55 మంది పాకిస్థాన్ సైనికులు మరణించారని అఫ్గానిస్థాన్ జాతీయ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2021లో తాలిబాన్లు అఫ్గాన్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగినట్లు తెలుస్తోంది. మరోవైపు హార్మూజ్ జలసంధిలో నౌకల భద్రతపై విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రితో చర్చించినట్లు జైశ్వాల్ తెలిపారు. దేశ ఇంధన భద్రత, సరఫరా స్థిరత్వంపై కూడా చర్చలు జరిపినట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరాన్‌లో సుమారు 9 వేల మంది భారతీయులు ఉన్నారని, వారిలో అనేక మంది ఇప్పటికే భారత్‌కు సురక్షితంగా చేరుకున్నారని వెల్లడించారు.

# ముంబయికి చేరుకున్న చమురు ట్యాంకర్

- భారత నౌకలకు మార్గం సుగమం చేసిన ఇరాన్



బలగం టీవి, ముంబై

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భారత నేతృత్వంలోని ఓ చమురు ట్యాంకర్ వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటింది. లైబీరియా జెండాతో ప్రయాణిస్తున్న షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ నౌక సౌదీ అరేబియాలోని రాస్ తనురా ఓడరేవులో ముడి చమురు లోడ్ తీసుకుని బుధవారం ముంబయి ఓడరేవుకు చేరుకుందని పోర్ట్ ట్రస్ట్ అధికారులు తెలిపారు.మార్చి 1న రాస్ తనురా నుంచి బయలుదేరిన ఈ నౌక హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చిన తర్వాతే భారత్‌కు చేరుకుందని అధికారులు వెల్లడించారు.

ఇదిలా ఉండగా, హర్మూజ్ జలసంధి ద్వారా భారతీయ నౌకలు ప్రయాణించేందుకు ఇటీవల మార్గం సుగమమైంది. భారత జెండాతో ఉన్న ట్యాంకర్లు ఈ జలమార్గం గుండా వెళ్లేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చింది.

ముడి చమురు, సహజ వాయువు రవాణా సురక్షితంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీని ఫోన్‌లో కోరారు. ఇందుకు టెహ్రాన్ సానుకూలంగా స్పందించింది.ఈ నేపథ్యంలో భారత జెండాతో ప్రయాణిస్తున్న 'పుష్పక్', 'పరిమల్' అనే ట్యాంకర్లు సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తాజాగా షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ నౌక కూడా ముంబయి చేరుకోవడంతో చమురు రవాణా కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు.

# రేపటి నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు

- ఐదు నిమిషాల వరకు ఆలస్యమైనా అనుమతి
- రాష్ట్రవ్యాప్తంగా 2,676 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

వివరాలు 2వ పేజీలో

### ఖరీఫ్ సీజన్‌కు

# ముందస్తుగా యూరియా నిల్వలు

- ఏప్రిల్-జూన్‌కు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించాలని కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాబోయే ఖరీఫ్--2026 వ్యవసాయ సీజన్ దృష్ట్యా రాష్ట్రంలో ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిం చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చే మూడు నెలలు అయిన ఏప్రిల్, మే, జూన్ నెలలకు ప్రతి నెల 2.00 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున యూరి యాను కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మరియు హార్టికల్చర్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభు త్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డాకు లేఖ రాసి రాష్ట్ర అవసరాలను వివరించారు. గత రబీ సీజన్‌లో రాష్ట్రానికి సమయానికి యూరియా కేటాయించినందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయగలిగామని అన్నారు. ఆ కేటాయింపుల వల్ల గత ఖరీఫ్ సీజన్‌లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా వ్యవసాయ కార్యకలా పాలు సజావుగా సాగాయని పేర్కొన్నారు. రాష్ట్ర రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం సమయానుకూలంగా స్పందించడం వల్ల వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరిగిందని తెలిపారు.

ప్రస్తుతం రాష్ట్రంలో రబీ సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న నేపథ్యంలో ఖరీఫ్--2026 సీజన్ ప్రారంభానికి యూరియా ప్రారంభ నిల్వలు 50 వేల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే ఉండవచ్చని మంత్రి తెలిపారు. 2024 ఖరీఫ్ సీజన్ లో రాష్ట్రానికి గణనీయమైన ప్రారంభ నిల్వలు ఉండటం వల్ల ఎరువుల సరఫరా సాఫీగా జరిగిందని గుర్తు చేశారు. ఖరీఫ్--2024 లో 4.65 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా, ఖరీఫ్--2025లో 1.99 లక్షల మెట్రిక్ టన్నుల ప్రారంభ నిల్వలు ఉండటం వల్ల ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రావడం జరిగిందని గుర్తు చేశారు. అయితే ఈ సంవత్సరం ప్రారంభ నిల్వలు 50 వేలకు మించి ఉండకపోవచ్చని తెలిపారు. 2024 ఖరీఫ్ సీజన్లో ఉన్న నిల్వలు రాష్ట్రానికి బఫర్ స్టాక్ ఏర్పాటుకు దోహదపడి రైతులకు ఎరువులు నిరంతరంగా అందుబాటులో ఉండేలా చేశాయని తెలిపారు. అయితే రాబోయే ఖరీఫ్ సీజన్‌కు ఈ విధంగా ప్రారంభ నిల్వలు ఉంచుకోవడం ఇప్పుడు ప్రాధాన్యతగా మారిందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం సాగు విస్తీర్ణంలో దాదాపు 70 శాతం పంటలు ఖరీఫ్ సీజన్‌లోనే సాగు అవుతాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలు ఈ సీజన్‌లో విస్తృతంగా సాగు చేయబడతాయి. ఈ పంటలకు అధిక మొత్తంలో యూరియా అవసరం ఉంటుందని చెప్పారు. సాధారణంగా రాష్ట్రంలో జూలై, ఆగస్టు నెలల్లో యూరియా వినియోగం గరిష్ట స్థాయికి చేరుకుంటుందని మంత్రి వివరించారు.ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఖరీఫ్ సీజన్ కొంత ముందుగానే ప్రారంభమ వుతుందని మంత్రి తెలిపారు. అందువల్ల రైతులకు సమయానికి ఎరువులు అందుబాటులో ఉండేందుకు ముందుగానే నిల్వలు ఏర్పాటు చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా వినియోగం తక్కువగా ఉండే ఏప్రిల్, మే నెలల్లో బఫర్ స్టాక్ ఏర్పాటు చేయడం ద్వారా తరువాతి నెలల్లో పెరిగే డిమాండ్‌ను సులభంగా తట్టుకోవచ్చని అన్నారు.అలాగే యూరియా పక్కదారి పట్టకుండా ఎరువుల సరఫరా పారదర్శకంగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే యూరియా యాప్ (ఖతీము ‐ూజూజూ) ను ప్రారంభించిందని మంత్రి తెలిపారు. ఈ యాప్ ద్వారా రైతులు తమకు కేటాయించిన ఎరువుల వివరాలు తెలుసుకోవడమే కాకుండా సమీపంలో ఎక్కడ ఎరువులు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవచ్చని చెప్పారు. అదేవిధంగా అధికారులు కూడా ఎరువుల నిల్వలు మరియు పంపిణీ వివరాలను సులభంగా పర్యవేక్షించగలుగుతున్నారని పేర్కొన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో యూరియా డిమాండ్ ఎక్కువగా ఉండే జూలై మరియు ఆగస్టు నెలల్లో కనీసం నెలకు 3.00 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందు గానే తగిన నిల్వలు సిద్ధం చేయడం ద్వారా రైతులకు ఎరువుల కొరత లేకుండా సరఫరా చేయవచ్చని ఆకాంక్షించారు.ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బఫర్ నిల్వలు ఏర్పాటుకు అనుకూలంగా సరఫరా ప్రణాళిక కింద ఏప్రిల్, మే మరియు జూన్ నెలలకు ప్రతి నెల 2.00 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కేటాయింపులు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే తగిన నిల్వలు ఏర్పరచుకుని ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా యూరియా అందుబాటులో ఉంచగలదని మంత్రి తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా నిరంతరంగా కొనసాగడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి స్థిరత్వానికి దోహదపడుతుందని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన స్పందించి యూరియా సరఫరాలపై అనుకూల నిర్ణయం తీసుకుంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎల్పీజీ సిలిండర్ల కొరతపై కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి లేఖ




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) కోరారు. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి లేఖ రాశారు. ప్రస్తుతం ఎల్పీజీ సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన అంతరాయం కారణంగా హోటళ్లు, తినుబం డారాల కేంద్రాలు, పీజీ హాస్టళ్లు, చిన్న ఆహార వ్యాపారాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. వెంటనే సరఫరా పునరుద్ధరిం చకపోతే వేలాది వ్యాపార సంస్థలు మూతపడే ప్రమాదం ఉందని, లక్షలాది మంది కార్మికులు, విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం స్థాయిలవారీగా (టైర్డ్ సిస్టమ్) ఎల్పీజీ కేటాయింపు విధానాన్ని అమలు చేయాలని ఆయన సూచించారు. అలాగే సిలిండర్ల లభ్యతపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించేందుకు రియల్ టైమ్ పబ్లిక్ డాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాణిజ్య సిలిండర్ల ధరలను పెంచకుండా తాత్కాలికంగా ధరల స్థిరీకరణ చేపట్టాలని అభ్యర్థించారు. అదేవిధంగా గృహ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లిస్తూ జరుగుతున్న నల్లబజారును అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సూచించారు. ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ఉన్న పీజీ హాస్టళ్లకు ప్రత్యేక కేటగిరీ కింద గ్యాస్ సరఫరా చేయాలని తెలిపారు.గ్యాస్ ఆధారిత శ్మశాన వాటికలను అత్యవసర సేవలుగా గుర్తించి వాటికి ప్రాధాన్యంగా గ్యాస్ కేటాయింపు చేయాలని కూడా ఆయన కోరారు. హోటల్, ఆహార రంగాలపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికుల జీవనోపాధి దెబ్బతినకుండా కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

### ఆర్టీసీ కార్మికుల పక్షాన

# అసెంబ్లీలో గళమెత్తుతా

- ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ప్రైవేటీకరణ కుట్ర చేస్తున్న ప్రభుత్వం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తెలిపారు. మంగళవారం టీజీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు ఆయనను కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హరీశ్ రావు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీకి, కార్మికులకు అన్యాయం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని హరీశ్ రావు విమర్శించారు. ప్రైవేట్ కంపెనీలతో 2000 ఎలక్ట్రిక్ బస్సుల సరఫరాకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని, ఇది సంస్థను బలహీనపర్చే చర్య అని అన్నారు. కేంద్రం నుంచి వచ్చే సబ్సిడీలను నేరుగా ఆర్టీసీకే ఇవ్వాలని కార్మికులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణానికి ప్రతినెలా 350 కోట్ల రూపాయలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం అరకొర నిధులు మాత్రమే చెల్లిస్తున్నట్లు తెలిపారు. గత రెండేళ్లుగా ఈ పథకానికి సంబంధించిన బకాయిలను ఆర్టీసీపైనే మోపడం వల్ల సంస్థ ఆర్థికంగా కుదేలవుతోందని అన్నారు. వెంటనే రూ.2,804 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు రెండు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, 2025 పీఆర్సీ కూడా అమలులోకి రాలేదని హరీశ్ రావు పేర్కొన్నారు. రిటైర్ అయిన ఉద్యోగుల క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ (సీసీఎస్) డిపాజిట్లపై గత 23 నెలలుగా వడ్డీ చెల్లించకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ ఇప్పటి వరకు 'అపాయింటెడ్ డే' ప్రకటించకపోవడం అన్యాయమని విమర్శించారు. కార్మికుల పదోన్నతులు, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ ప్రయోజనాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. ఉచిత ప్రయాణ పథకం అమలవుతున్నప్పటికీ పెరిగిన రద్దీకి తగిన విధంగా కొత్త బస్సులు కొనుగోలు చేయడం, సిబ్బంది నియామకం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సిబ్బంది కొరతతో కార్మికులపై పని భారం పెరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేసి ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని, కార్మికుల సమస్యలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బలంగా ప్రస్తావిస్తామని స్పష్టం చేశారు.

## సినిమా రంగం రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



- సీఎం రేవంత్ రెడ్డి
- కోకాపేటలో 'డోల్బీ అల్లు సినిమాస్' ప్రారంభం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సినిమా రంగం కూడా ఒక గొప్ప పరిశ్రమగా, తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. సినిమా పరిశ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడంతో పాటు అభివృద్ధికి అన్ని రకాలుగా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. సినీ నిర్మాత అల్లు అరవింద్ గారి కుటుంబం కోకాపేటలో నిర్మించిన దేశంలోని అతిపెద్ద డోల్బీ అల్లు సినిమాస్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగాల తరహాలో సినిమా ఇండస్ట్రీగా ఎదగాలని ఆకాంక్షించారు.

సినిమాలు మధ్య తరగతి వారిపై అత్యంత ప్రభావం చూపిస్తున్నాయని, జీవితంలో కొన్ని నిర్ణయాలు తీసుకోవడానికి, సామాజిక కోణంలో సినిమాలు అత్యంత ప్రభావం చూపిస్తాయని అన్నారు.హాలీవుడ్ సినిమాలను చూడటం కాకుండా మనం తీయగలిగే స్థాయికి ఎదగాలని కోరారు. ఇక్కడి సినిమా రంగం ఒక నాలెడ్జ్ హబ్‌గా ఎదగాలని, నాలెడ్జ్ హబ్ క్రియేట్ చేసినప్పుడే గొప్పగొప్ప సినిమాలు తీయగలమని అన్నారు. తెలుగు సినిమా రంగం పాన్ ఇండియాతో కాకుండా హాలీవుడ్‌తో పోటీ పడాలన్నారు.అల్లు అరవింద్ కుటుంబం ఎంతో ఇష్టంతో నిర్మించిన ఈ డాల్బీ థియేటర్ తెలంగాణకు మంచి పేరు తెస్తుందని ముఖ్యమంత్రి గారు ఆకాంక్షించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , ఎమ్మెల్యే కుందూరు జయవీర్, గీతా ఆర్ట్స్ అధినేత, సినీ నిర్మాత అల్లు అరవింద్ , తెలంగాణ ఫిలిమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు , నటుడు అల్లు అర్జున్‌తో పాటు సినిమా రంగానికి చెందిన అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

### నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు

# భారత్ ఫ్యూచర్ సిటీలో స్థలం కేటాయింపు




- ప్రపంచ ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఆకర్షించాలనే లక్ష్యం
- సీఎం రేవంత్ రెడ్డి
- హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో ప్రారంభం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు భారత్ ఫ్యూచర్ సిటీలో అవసరమైన స్థలం కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రకటించారు. ప్రపంచంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలను హైదరాబాద్ నుంచి కార్యకలాపాలను నిర్వహించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని, నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కార్యాలయం కూడా ఈ మహానగరం నుంచి కొనసాగించాలని అభిలషించారు.

దేశంలో ముంబై తర్వాత హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోను ముఖ్యమంత్రి గారు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో కలిసి ప్రారంభించారు. ఐలైన్ స్టూడియో ప్రారంభంతో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల్లో హైదరాబాద్ విప్లవాత్మకమైన మార్పులకు వేదిక కానుంది.ఈ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ తరుణం వచ్చేసింది. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చేసింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో సరిపడా పరిమాణంలో నెట్‌ఫ్లిక్స్ విస్తరణ కోసం స్థలం కేటాయిస్తాం. అవసరమైతే నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కార్యాలయాన్ని హైదరాబాద్‌కు రిలొకేట్ చేయాలి.ఒకప్పుడు బ్లాక్ అండ్ వైట్ నుంచి టెక్నోకలర్, అక్కడి నుంచి ఈస్ట్‌మన్ కలర్, తర్వాత 70 ఎంఎం, డాల్బీ, అక్కడి నుంచి ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది. ఈ ప్రాంతం టాలీవుడ్, బాలీవుడ్ కాకుండా హాలీవుడ్ కూడా రావాలని మొదటి నుంచి బలంగా కాంక్షిస్తున్నా.

ఫార్చ్యూన్ 500 కంపెనీలను హైదరాబాద్‌లో ఏర్పాటు కావాలన్నది మా ఆకాంక్ష. 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. మీ పెట్టుబడులకు అన్ని విధాలుగా రక్షణ ఉంటుంది. నెట్‌ఫ్లిక్స్ ప్రపంచానికి వినోదం అందించాలని చూస్తోంది. మేం ప్రపంచాన్ని సుసంపన్నం చేయాలని చూస్తున్నాం. మీకూ మాకు మధ్యన సారూప్యత ఉంది. నెట్‌ఫ్లిక్స్, హైదరాబాద్ ప్రపంచంలోని అన్ని సంస్కృతులను ప్రజలను ఆహ్వానిస్తుంది. నెట్‌ఫ్లిక్స్, హైదరాబాద్ రెండూ గేట్‌వేలుగా పనిచేయడానికి దోహదపడుతాయి. ప్రపంచవ్యాప్తంగా వీక్షకుల కోసం ట్యాలెంట్, కంటెంట్‌ను నెట్‌ఫ్లిక్స్ అందిపుచ్చుకుంటే, హైదరాబాద్ అవకాశాలు, ప్రపంచ నైపుణ్యతను కలిగి ఉంది. మనం వారధి లాంటివాళ్లం. మార్పును ఆశించే వాళ్లం.డీవీడీలను అద్దెకు సమకూర్చే స్థాయి నుంచి ఓటీటీలో ప్రపంచ లీడర్‌గా నెట్‌ఫ్లిక్స్ ఎదిగింది. ఫుడ్, ట్రావెల్, వారసత్వం, సంస్కృతి విషయాల్లో ప్రజలు నెట్‌ఫ్లిక్స్‌ను, హైదరాబాద్‌ను ప్రేమిస్తారు. ప్రపంచ వీక్షకులకు తెలంగాణను విశ్వవ్యాప్తం చేయడంలో నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ ఫెసిలిటీ ఎంతో ఉపయోగపడుతుంది. నెట్‌ఫ్లిక్స్ ఈ మధ్య కాలంలో స్పోర్ట్స్‌పై దృష్టిని సారించింది. స్పోర్ట్స్‌లో ఈ సంస్థ అతిపెద్ద బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ కాబోతుంది. తెలంగాణ ప్రభుత్వం కూడా అన్ని స్థాయిల్లో ట్యాలెంట్‌ను గుర్తించాలన్న లక్ష్యంతో క్రీడల పట్ల, క్రీడాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. మీకూ మాకూ ఎంతో సారూప్యత కలిగిన నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ – హైదరాబాద్ రెండూ కలిసి మంచి విజయాలను సాధించాలి.

నెట్‌ఫ్లిక్స్‌కు తెలంగాణ స్వాగతం పలుకుతోంది. ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తాం. భారత్, తెలంగాణ భవిష్యత్తులో ప్రపంచస్థాయి వినోదాన్ని అందిస్తాయనడానికి ఈ కార్యక్రమమే ఒక నిదర్శనం. మనం కలిసి భవిష్యత్తుపై బలమైన ముద్ర వేద్దాం... అని పిలుపునిచ్చారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐలైన్ స్టూడియో సీఈఓ జెఫ్ షపిరో గారు, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు గారు, సినీ నటుడు, నిర్మాత రాణా దగ్గుబాటి, తెలంగాణ ఫిలిం డెవల్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతో పాటు నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.



## యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

- **పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అధికారులు**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా యాదాద్రి ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు గవర్నర్‌ను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, దేవస్థానం ఈవో భవాని శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- **ఈ నెల 15న జరిగే "ఫీజు పోరు దీక్ష"కు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్ధతు**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో సుమారు రూ. 7,500 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ రోజు హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ప్రతినిధులు రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని కలిసి, ఈ నెల 15న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న "ఫీజు పోరు దీక్ష"కు మద్దతు కోరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం నిర్వహించే ఈ దీక్షకు సీపీఐ(ఎం) పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేసారు.

ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ, నిరుపేద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల ఉన్నత చదువులకు వెన్నెముకగా ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రియంబర్స్‌మెంట్ పెండింగ్ వల్ల విద్యార్థులు ఉన్నత విద్యను మధ్యలోనే ఆపేయాల్సి రావడం అత్యంత దురదృష్టకరం. కోర్సులు పూర్తి చేసినా బకాయిల సాకుతో విద్యా సంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు పైచదువులు, ఉద్యోగ అవకాశాలను కోల్పోయి, తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసే ప్రభుత్వం, పేద విద్యార్థుల విద్యకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కనీస హక్కు అయిన ఫీజుల విషయంలో మొండివైఖరి ప్రదర్శించకుండా బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విద్యార్థుల ఖాతాల్లో నేరుగా జమ చేయాలని, సర్టిఫికెట్లు ఆపేసిన విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేసారు.

## హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో చిక్కుడు ప్రభాకర్ నామినేషన్

- **వందలాది న్యాయవాదులతో కలిసి నామినేషన్ దాఖలు**

**బలగం టీవీ, హైదరాబాద్**



హైకోర్టు న్యాయవాద అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఈ నెల 26న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రజాన్యాయవాది చిక్కుడు ప్రభాకర్ గురువారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. వందలాది హైకోర్టు న్యాయవాదులతో కలిసి బార్ అసోసియేషన్ హాల్లో రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని, న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం పోటీ చేస్తున్న చిక్కుడు ప్రభాకర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని నినాదాలు చేశారు.

నామినేషన్ అనంతరం చిక్కుడు ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 104 బార్ అసోసియేషన్‌లకు హైకోర్టు బార్ అసోసియేషన్ తల్లి వంటిదని తెలిపారు. న్యాయవాద రక్షణ చట్టం లేకపోవడం, కుటుంబాలకు సరిపడా ఆరోగ్య బీమా, జీవిత బీమా సౌకర్యాలు లేకపోవడం వల్ల పేద, మధ్యతరగతి న్యాయవాద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. హైకోర్టులో బెంచ్–బార్, బార్–రిజిస్ట్రీ మధ్య సమన్వయం లోపించడం వల్ల కూడా న్యాయవాదులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్‌ను దేశంలోనే సమర్థవంతమైన సంస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. గత 28 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ అనేక ప్రజా సమస్యలను హైకోర్టు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించానని తెలిపారు. న్యాయవాదుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు కృషి చేస్తానని, అందుకోసం తనకు మద్దతుగా భారీ మెజారిటీతో గెలిపించాలని న్యాయవాదులను కోరారు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణకు ఐకాన్

- **రూ.1000 కోట్లతో అభివృద్ధికీ రూట్ మ్యాప్**
- **నిధులు మంజూరు చేయడం అభినందనీయం**
- **సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు**
- **మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అటువంటి విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకెంతో గర్వకారణమని ఆయన చెప్పారు. అంతటి పేరెన్నికగన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తాను కాంక్షిస్తున్నానని ఆయన చెప్పారు. గురువారం ఉదయం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో ఆయన నిర్మాణ్–26 సాంకేతిక సదస్సును ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 1917 లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు.అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభం అయిన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరవ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. అంతటి ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికీ ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఏకంగా 1,000 కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు.అంతర్జాతీయ స్థాయిలో ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలి అన్నదే ప్రభుత్వ సంకల్పం అని అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన వెల్లడించారు.విశ్వవిద్యాలయంలో అవసరమైన అధ్యాపకుల భర్తీ విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.ఇక్కడి నుండి ఎంతో మేధో సంపద ఉత్పత్తి అయిందని ఆ మేధస్సు ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి దోహద పడుతుందన్నారు.

సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న మెజారిటీ ఇంజినీర్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఎదిగిన వారు అని,అంతే గాకుండా గల్లీ నుండి డిల్లీ స్థాయికి ఎదిగిన నేతలు, క్రీడాకారులు,ఉన్నత పదవులు చేపట్టిన వారి అడుగులు ఇక్కడి నుండే మొదలు అయ్యాయని ఆయన చెప్పారు.అటువంటి విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలుచోవడమే కాకుండా విద్యార్థులు చేసిన త్యాగాలు ఇక్కడ ప్రస్తావనర్హమే అని భావిస్తున్నానని ఆయన చెప్పారు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలలో కుడా భాగస్వామ్యం కావాలని ఆయన ఉద్బోధించారు.ఇంజినీరింగ్ విభాగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ తెలంగాణా రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు.

నిజాంసాగర్,నాగార్జునసాగర్,శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్.ఎల్.బి.సి,దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు.సివిల్ ఇంజినీరింగ్ విభాగము విద్యార్థులకు ప్రాక్టికల్స్ పాఠాలుగా ఉపయోగ పడుతాయని ఆయన చెప్పారు. భవిష్యత్ లో స్థిరమైన అభివృద్ధి,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం,జలవనరుల సమగ్ర నిర్వహణ తో పాటు చెక్ డ్యామ్ ల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంజినీర్లు ప్రాజెక్టుల నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాకుండా వాటి భద్రత,నిర్వహణ బాద్యతలు కుడా ఇంజినీర్లకు ఉంటాయన్నారు. నిర్మాణ్–26 వంటి సాంకేతిక సదస్సులు విద్యార్థులకు పరిశోధన,సృజనాత్మక తాను పెంపొందించే వేడికలని ఆయన చెప్పారు. మన నిర్మాణాలు కేవలము కట్టడాలకే పరిమితము కాకుండా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు దోహద పడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధించారు.

# రేపటి నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు

- **ఐదు నిమిషాల వరకు ఆలస్యమైనా అనుమతి**
- **రాష్ట్రవ్యాప్తంగా 2,676 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం ప్రారంభమయ్యే ఈ పరీక్షలు ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. పరీక్షలకు ఐదు నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను మాత్రమే అనుమతిస్తారు. ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే వారిని పరీక్షకు అనుమతించబోరని అధికారులు స్పష్టం చేశారు.విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,676 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రభుత్వ పాఠశాలల్లో 1,582 కేంద్రాలు, ప్రైవేట్ పాఠశాలల్లో 1,094 కేంద్రాలు ఉన్నాయి. ఈసారి మొత్తం 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన నిబంధనలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్ జోన్లు'గా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్క్వాడ్ సభ్యులు సహా ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. తనిఖీలకు వచ్చే అధికారులు కూడా సెల్‌ఫోన్లు బయటే ఉంచాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత సిబ్బందిపై సస్పెన్షన్ చర్యలు తీసుకుంటారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

ఈసారి పదో తరగతి పరీక్షలతో పాటు జవాబుపత్రాల మూల్యాంకనం కూడా సమాంతరంగా నిర్వహించనున్నారు. ఏప్రిల్ 1 నుంచి సమాధాన పత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుంది. పరీక్షల నిర్వహణతో పాటు మూల్యాంకన క్యాంపులను కూడా నిర్వహించాల్సి రావడంతో జిల్లా విద్యాశాఖాధికారులకు (డీఈవోలకు) ఇది సవాల్‌గా మారనుంది.

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన లైసెన్సుడ్ సర్వేయర్లు.

- **సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి.**

**బలగం టీవీ, హైదరాబాద్**



రాష్ట్ర వ్యాప్తంగా లైసెన్సుడ్ సర్వేయర్లుగా దాదాపు 5 వేలకు పైగా నియమించినా నెలల తరబడిగా అటు పని, ఇటు జీతభత్యాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని ఇవాళ వారంతా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి స్థానంలో పేరుకు భూభారతిని తీసుకొచ్చినప్పటికి అందులో భాగంగా ఎంపిక చేసిన లైసెన్సుడు సర్వేయర్లకు మాత్రం అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రంలో లైసెన్స్ సర్వేయర్లకు ప్రతినెల గౌరవప్రదమైన ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు చేశారని, కానీ తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ సర్కారు అన్యాయం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమకు ఎదురవుతున్న రెండు ప్రధాన సమస్య లతో పాటు ఇతర అంశాలపై కేటీఆర్ గారికి వినతి పత్రం సమర్పించారు.

తమకు లైసెన్సు పత్రాలు ఇచ్చి నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు జీతభత్యాల గురించి పట్టించుకోకుండా తమ కుటుంబాలను రోడ్డున పడేసారని దుయ్యబడ్డారు. ప్రభుత్వానికి అత్యంత కీలకమైన భూ సర్వే పనులు నిర్వహించే తమకు స్థిరమైన వేతనం లేకపోవడం వల్ల ఆర్థికంగా చితికి పోతున్నామని తమ కష్టాలను చెప్పుకున్నారు. ప్రతినిత్యం తమను ఎమ్మార్వో కార్యాలయాలకు పిలిపించి ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చోపెడుతున్నారు తప్ప ఒక్క పని కూడా అప్పగించలేదని కేటీఆర్ గారి దృష్టికి తీసుకొచ్చారు.

తమకు వర్క్ అలాట్మెంట్ విషయంలో స్పష్టమైన విధానం లేకపోవడం వల్లే ప్రధానంగా సమస్య ఉత్పన్నమైందని వెల్లడించారు. ప్రతి లైసెన్సుడు సర్వేయర్ కు సమానంగా , పారదర్శకంగా పనులను కేటాయించే విధంగా ఒక సమగ్రమైన విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఈ సందర్భంగా కేటీఆర్ గారు వారికి హామీ ఇచ్చారు.

# వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి...



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల పీహెచ్ సీని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, రక్త పరీక్షలు చేసే ల్యాబ్, మందుల గది, ఇతర గదులు, ఆవరణ పరిశీలించారు. వ్యాక్సిన్లు, మందుల నిలువపై ఆరా తీశారు.రోజు

- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

ఆసుపత్రికి ఎందరు రోగులు వస్తున్నారని, ఎందరు గర్భిణులు వైద్య సేవలు పొందుతున్నారని ఆరా తీశారు. రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య సేవలపై అందరికీ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలుపాలని సూచించారు. ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణలో ఆర్మ్డ్ రిజర్వ్ పాత్ర కీలకం..

- **మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి..**
- **ఫైరింగ్,రాత పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంశలు..**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతో పాటు ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ విభాగం కూడా కీలక పాత్ర పోషిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తోందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అభినందించారు. సాయుధ దళాల వార్షిక పునర్ ఉచ్చరణ (మోబిలైజేషన్) ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజున ఎస్పీ పరేడ్ మైదానంలో నిర్వహించిన సాయుధ దళాల సమీకరణ కవాతు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈసందర్భంగా ఎస్పీ జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ అధికారులు,సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు.శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతో పాటు ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం కూడా ఎంతో సమర్థవంతంగా పని చేస్తోందని, అదే ఉత్సాహంతో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. వార్షిక మోబిలైజేషన్ శిక్షణలో భాగంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఆర్మ్స్ డ్రిల్, లాఠీ డ్రిల్, ఫుట్ డ్రిల్, సెర్మోనియల్ డ్రిల్, గార్డ్ మౌంటింగ్, మాబ్ ఆపరేషన్, ఫైరింగ్, నాకబంది, పికెట్స్, వీఐపీ బందోబస్త్ విధులు, ప్రిసనర్ మరియు క్యాష్ ఎస్కార్ట్ వంటి అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు.

పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు తమ వృత్తి నైపుణ్యాలను మర్చిపోకుండా



ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ శారీరక దారుఢ్యం కాపాడుకోవాలని ఎస్పీ సూచించారు. ఇందుకు మోబిలైజేషన్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉండే పోలీస్ అధికారులు, సిబ్బందికి వ్యక్తిగత,కుటుంబపరమైన మరియు శాఖాపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. అంతకుముందు వార్షిక శిక్షణలో భాగంగా జిల్లాలో పని చేస్తున్న,అధికారులకు సిబ్బందికి సార్ధపూర్ బెటాలియన్ లో గల ఫైరింగ్ రేంజ్ నందు ఇచ్చే ఫైరింగ్ శిక్షణను జిల్లా ఎస్పీ పర్యవేక్షించారు.అనంతరం ఎస్పీ కూడా ఫైరింగ్ ప్రాక్టీస్ చేయడం జరిగింది.

**ఫైరింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారు.**

1. బి. శ్రీనివాస్.
2. జి. వెంకటేష్.
3. ఏ. ప్రియాంక.

**రాత పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారు.**

1. మనోజ్ కుమార్.
2. బి. శ్రీనివాస్.
3. డి. ప్రియాంక.

ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు సిబ్బంది ఉన్నారు.

# డ్రగ్స్‌కు అడ్డుకట్టపై అవగాహన కార్యక్రమం..




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఈగల్ టీం డైరెక్టర్ శాందీప్ శ్యాండిల్య పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పిల్లల భద్రత -- డ్రగ్స్‌కు అడ్డుకట్ట కార్యక్రమంలో బాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.గురువారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ నటేష్ సిరిసిల్ల పట్టణ పరిధిలోని గీతానగర్ ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించి,డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలు, వాటి దుష్పరిణామాలు, అలాగే పిల్లల భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ నటేష్ మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన నేటితరం విద్యార్థులని,వారిని మాదకద్రవ్యాల మహమ్మారి నుండి కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని,విద్యార్థులు తమ శక్తిని క్రీడలు, విద్య మరియు ఇతర నిర్మాణాత్మక కార్యక్రమాల వైపు మళ్లించుకోవాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ టీం (డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఎలైట్ యాక్షన్ (గ్రూప్ టీమ్) సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కడైనా డ్రగ్స్ సరఫరా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే భయపడకుండా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. డ్రగ్స్ వ్యాపారంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని,యువత భవిష్యత్తును కాపాడటమే పోలీస్ శాఖ మరియు ఈగల్? టీమ్‌ల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# జనవాసాల మధ్య సెల్ టవర్ వేస్తే ఊరుకుండేది లేదు..

- **ఎంతటి పోరాటానికైనా సిద్ధం**
- **అల్మాస్పూర్ గ్రామస్తులు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్ గ్రామంలో ఎయిర్టెల్ టవర్ జనావాసాల మధ్య వేస్తే ఊరుకుండేది లేదని గ్రామ ప్రజలు అన్నారు. జనవాసాల మధ్య సెల్ టవర్ వేయడంతో రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యాల బారిన అవకాశము ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎక్కడైనా దూరంగా సెల్ టవర్ వేసుకోవాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. గత మూడు రోజుల నుండి గ్రామంలో నిరాహార దీక్ష చేస్తున్నామని అధికారులు మాత్రం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని సెల్ టవర్ ఊరికి దూరంగా వేసేంతవరకు తమ పోరాటం కొనసాగిస్తామని గ్రామ ప్రజలు తెలిపారు. జనవాసాల మధ్య సెల్ టవర్ వద్దని పోరాటం చేస్తుంటే కొందరు తమను భయభ్రాంతులకు గురిచేస్తూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేశారని గ్రామ ప్రజలు ఆపోయారు. ఎన్ని భయభ్రాంతులకు గురిచేసిన మా పోరాటం మాత్రం ఆగదని గ్రామ ప్రజలు అన్నారు.




# జిల్లా పరిషత్ హైస్కూల్ నెహ్రూనగర్‌లో ఘనంగా పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

నెహ్రూనగర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ సభాధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిరిసిల్ల పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళా చక్రపాణి, స్థానిక కౌన్సిలర్ ఎర్రం వెంకట్రాజం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గంగుల రుక్మిణి హాజరయ్యారు.

ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకొని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. గురువులు అందించే మార్గదర్శకాన్ని అనుసరించి విద్యార్థులు జీవితంలో మంచి స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులను అభినందిస్తూ వారికి జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాతలు అన్నల్ దాస్ శ్రీనివాస్, బొప్ప దేవయ్య, లక్ష్మణ్, ప్రాథమిక పాఠశాల గోపాల్ సగర్‌కు చెందిన డి. భాగ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నూతన భవనాలకు భూమి పూజా.

- **కృతజ్ఞతలు తెలిపిన మహిళా సంఘాల సభ్యులు.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని జిల్లెళ్ళ గ్రామం లో 12 లక్షల రూపాయల తో నూతన అంగన్వాడి భవనం, 10 లక్షలతో రూపాయలతో లక్ష్మీ మహిళా సమాఖ్య స0ఘ నూతన భవనం మరియు కస్బే కట్కూర్ గ్రామం లో రెండు మహిళా సమాఖ్య భవనాలు సమన్వయ,భగవతి మహిళా వి వో భవనాలకు 10 లక్షల చొప్పున మంజూరు కాగా నేడు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారయణ గౌడ్, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి గారు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ టోనీ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు నేరాల నర్సింగ0 గౌడ్,జిల్లెళ్ళ సర్పంచ్ దుబ్బాక రజిత రమేష్,కట్కూర్ సర్పంచ్ బొడ్డు స్వాతి, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,నాయకులు పబ్బతి కృష్ణారెడ్డి , మునిగల రాజు, రాజేశ్వర్ రావు, నరేందర్, శ్రీనివాస్, పై గ్రామాల ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు,గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు , మహిళసంఘ సభ్యులు పాల్గొన్నారు.



## వ్యవసాయ కళాశాలను సందర్శించిన కలెక్టర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని డా.బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలను కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని పలు విభాగాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ముందుగా కళాశాలలోని సాయిల్ సైన్స్, ఎంటమాలజీ, జెనెటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్ విభాగాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ నిర్వహిస్తున్న మట్టి, నీటి నమూనాల విశ్లేషణ విధానాలు, హాని కలిగించే కీటకాలు, వాటి నివారణ పద్ధతులపై అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి కళాశాలలో అందుతున్న వసతులు, మౌలిక సదుపాయాల కల్పన గురించి ఆరా తీశారు. ఈ సందర్శనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కళాశాల అసోసియేట్ డీన్ సునీత దేవి, తదితరులు ఉన్నారు.





## తండ్రి మెడలో టీ20 ప్రపంచకప్ మెడల్...

**'నా జీవితంలో నిజమైన హీరో' అన్న శివం దూబే**

**బలగం టీవీ, హైదరాబాద్**

పొట్టి ప్రపంచకప్‌లో భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన రాష్ట్రఅఋుఎ ఐబఎవపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. టీమిండియా వరుసగా రెండోసారి విజేతగా నిలవడంలో అతని పాత్ర ముఖ్యమైందని మాజీ క్రికెటర్లు అభినందిస్తున్నారు. అయితే దూబే మాత్రం తన జీవితంలో నిజమైన హీరో తన తండ్రేనని అభిమానులకు పరిచయం చేశాడు. పొట్టి ప్రపంచకప్ విజేతలుగా స్వదేశానికి చేరుకున్న భారత ఆటగాళ్లు తమ ఆనందాన్ని కుటుంబ సభ్యులతో పంచుకుంటున్నారు. ఈ సందర్భంగా శివం దూబే తన తండ్రి Rajesh Dube మెడలో ప్రపంచకప్ మెడల్ వేసి సంబరపడాడు. టీమిండియా జెర్సీ ధరించిన తండ్రి మెడలో తనకు లభించిన మెడల్‌ను వేసి ఆనందం వ్యక్తం చేశాడు. ఆ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన దూబే "నా జీవితంలో నిజమైన హీరో" అనే క్యాప్షన్ పెట్టాడు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అభిమానులు కూడా ఈ తండ్రి–కొడుకుల భావోద్వేగ క్షణాన్ని ప్రశంసిస్తున్నారు.

ఐపీఎల్‌లో సంచలన ప్రదర్శనతో భారత టీ20 జట్టులోకి వచ్చిన దూబే క్రమంగా నమ్మదగిన ఆల్‌రౌండర్‌గా ఎదిగాడు. గత ప్రపంచకప్‌లో సాధారణంగా ఆడినప్పటికీ, ఈసారి మాత్రం మెరుపు ఇన్నింగ్స్‌లతో జట్టుకు కీలక విజయాలు అందించాడు. ఈ టోర్నీలో 169.06 స్ట్రైక్‌రేట్‌తో రెండు అర్ధశతకాలతో కలిపి మొత్తం 235 పరుగులు సాధించాడు. వరల్డ్‌కప్ గెలిచిన తర్వాత సొంతూరికి రైలులో వెళ్లి అందర్నీ ఆశ్చర్యపరిచిన దూబే, ఇంటికి చేరుకున్నాక తండ్రితో తన ఆనందాన్ని పంచుకున్నాడు.

## సన్‌రైజర్స్ లీడ్స్‌లో పాకిస్తాన్ స్పిన్నర్

- **రూ.2.34 కోట్లకు కాంట్రాక్ట్**
- **'ది హండ్రెడ్' లీగ్ కోసం జట్టులోకి ఎంపిక**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ పాకిస్తాన్ స్టార్ లెగ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. రూ.2.34 కోట్ల విలువైన ఈ కాంట్రాక్ట్ ద్వారా అతన్ని జట్టులోకి తీసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం అబ్రార్ అహ్మద్ 'ది హండ్రెడ్' లీగ్ టోర్నమెంట్‌లో సన్‌రైజర్స్ లీడ్స్ తరపున ఆడనున్నాడు. ప్రస్తుతం ఈ లీగ్ కోసం జరుగుతున్న మెగా వేలంలో ఫ్రాంచైజీ యజమాని కావ్యా మారన్ స్వయంగా పాల్గొని అతన్ని ఎంపిక చేశారు. భారత కరెన్సీలో రూ.2.34 కోట్లకు సమానమైన 1,90,000 పౌండ్లతో ఈ ఒప్పందం కుదిరింది. అతని ప్రదర్శనను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫ్రాంచైజీ వర్గాలు తెలిపాయి.

ఐపీఎల్‌లో పాకిస్తాన్ ఆటగాళ్లను ఎంపిక చేయరాదనే నిబంధన ఉన్నప్పటికీ, 'ది హండ్రెడ్' లీగ్‌కు ఆ పరిమితి వర్తించదు. దీంతో సన్‌రైజర్స్ యాజమాన్యం ఎలాంటి సందేహం లేకుండా అబ్రార్ అహ్మద్‌ను జట్టులోకి తీసుకుంది. 27 ఏళ్ల అబ్రార్ అహ్మద్ పాకిస్తాన్ తరపున టెస్టులు, వన్డేలు, టీ20ల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్‌లో శ్రీలంకపై 3 వికెట్లకు 23 పరుగులు ఇచ్చి ఆకట్టుకున్నాడు. పాకిస్తాన్ సూపర్ లీగ్, బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్, మేజర్ లీగ్ క్రికెట్‌లలో కూడా అతనికి అనుభవం ఉంది. అయితే ఈ ఒప్పందం పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అనుమతిపై ఆధారపడి ఉంటుంది.

# పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..

- **ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యులు కావాలి..**
- **గ్రామ సభల ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి**
- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, వార్డు సభ్యులు చురుకుగా భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం తంగళ్లపల్లి మండలం జిల్లెలలోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలలో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికను ఐదు దశల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2న గ్రామ సభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి కార్యక్రమాలు, మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు, మే 22న జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు . చివరగా జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా కార్యక్రమాలు పూర్తి అవుతాయని అన్నారు.

జిల్లాలో ఇప్పటివరకు 573 ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు . 3 లక్షల 91 వేల గ్యాస్ సిలిండర్లు రూ.500కే సరఫరా చేసినామని, అలాగే 46,492 మంది రైతులకు రూ.370 కోట్ల 75 లక్షల రుణ మాఫీ చేయడంతో పాటు లక్షా 26 వేల మందికి రైతు భరోసా అందించామని పేర్కొన్నారు. 22,554 నూతన రేషన్ కార్డులు జారీ చేసి, గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు.

ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో పారిశుధ్య పనులు నిత్యం నిర్వహించాలని, రోడ్లు, మురుగు కాలువలు శుభ్రం చేయించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్లను సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాల భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి జూన్ 2 నాటికి పూర్తి చేయాలని,అలాగే పాఠశాలలు, హాస్టళ్లలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా అనే విషయాన్ని పరిశీలించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. రైతులు ఒకే పంటను సాగు చేయకుండా పంటల వైవిధ్యాన్ని కొనసాగించాలని, వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించాలని,గ్రామ సభల సందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు.


ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని అన్నారు. కారు వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తొలి గంటలో ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందిస్తే ప్రభుత్వం 'రహవీర్' పథకం కింద రూ.25 వేల ప్రోత్సాహకాన్ని అందిస్తుందని చెప్పారు. అలాగే ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే సదుపాయం ఉందని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల కార్యక్రమాలు, షెడ్యూల్ వివరాలను తెలియజేశారు. అలాగే విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ గీత, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, జిల్లా వైద్య అధికారి రజిత, సిరిసిల్ల మరియు వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, వ్యవసాయ కళాశాల డీన్ సునీత దేవి, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, గ్రామ సర్పంచ్ దుబ్బాక రజిత, మున్సిపల్ చైర్మన్లు రాజు, కళ తదితరులు పాల్గొన్నారు.


## 'ఉస్తాద్ భగత్ సింగ్'కు సెన్సార్ క్లియరెన్స్

- **యూ/ఏ సర్టిఫికెట్ మంజూరు**
- **మార్చి 19న ఉగాది కానుకగా విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్**

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రానికి సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్ మంజూరు చేసింది. హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా రాశీ ఖన్నా కీలక పాత్ర పోషిస్తున్నారు. దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ఎస్. థమన్ అందిస్తున్నారు. చిత్రాన్ని ఉగాది సందర్భంగా మార్చి 19న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో వరుస అప్డేట్‌లతో అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నారు మేకర్స్. ఇక ఈ చిత్రానికి మొత్తం రన్‌టైమ్ 2 గంటలు 33 నిమిషాలు 59 సెకన్లు. ఇందులో తొలి భాగం 1 గంట 11 నిమిషాలు 30 సెకన్లు ఉండగా, రెండో భాగం 1 గంట 22 నిమిషాలు 29 సెకన్లు ఉంది.



ఇటీవల పవన్ కల్యాణ్ ఈ చిత్రానికి డబ్బింగ్ ప్రారంభించారు. స్టూడియోలో డబ్బింగ్ చెబుతున్న ఫోటోలను చిత్రబృందం సోషల్ మీడియాలో విడుదల చేయగా అవి వైరల్ అయ్యాయి. 'గబ్బర్ సింగ్' తర్వాత పవన్ కల్యాణ్--హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## నా పెళ్లి 'లవ్ జిహాద్' కాదు: మోనాలిసా

**బలగం టీవీ, తిరువనంతపురం**



గత ఏడాది ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళాలో పూసలు అమ్ముతూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన మోనాలిసా భోంస్లే తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. కేరళలోని తిరువనంతపురం సమీపంలోని అరుమనూర్ శ్రీ నైనార్ దేవాలయంలో మహారాష్ట్రకు చెందిన నటుడు ఫర్మాన్ ఖాన్‌ను ఆమె హిందూ సంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నారు. ఈ వివాహంపై వస్తున్న విమర్శలు, ఆరోపణల నేపథ్యంలో మోనాలిసా స్పందిస్తూ తన పెళ్లిని 'లవ్ జిహాద్'గా ముద్ర వేయడం సరైంది కాదన్నారు. తాను స్వచ్ఛందంగా, హిందూ ఆచారాల ప్రకారమే వివాహం చేసుకున్నానని తెలిపారు. అన్ని మతాల పట్ల తనకు సమాన గౌరవం ఉందని, పెద్దవారైన తర్వాత తనకు నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకునే హక్కు తనకు ఉందని పేర్కొన్నారు. ఇక ఈ వివాహం వివాదాలకు దారితీసింది. మోనాలిసా తండ్రి విజయ్ సింగ్ భోంస్లే ఈ సంబంధాన్ని తీవ్రంగా వ్యతిరేకించడమే కాకుండా ఆమెను బలవంతంగా ఇంటికి తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్లు సమాచారం. దీంతో భద్రత నిమిత్తం మోనాలిసా కేరళ పోలీసులను ఆశ్రయించారు. మరోవైపు ఆమెను సినీరంగానికి పరిచయం చేసిన దర్శకుడు సనోజ్ మిశ్రా ఈ వివాహాన్ని 'లవ్ జిహాద్'గా అభివర్ణించగా, కేరళలోని సీపీఎం నేతలు మాత్రం ఈ జంటకు మద్దతు తెలిపారు. మంత్రి వి. శివన్‌కుట్టి, ఎంపీ ఏ.ఏ. రహీమ్ వివాహానికి హాజరై వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుతం మోనాలిసా మలయాళంలో 'నాగమ్మ', బాలీవుడ్‌లో 'ది డైరీ ఆఫ్ మణిపూర్' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.